

సబ్సిడీ పనిముట్ల పేరుతో మోసం

సబ్సిడీ పనిముట్లు ఇప్పిస్తానని దర్శికి చెందిన ఒక మోసగాడు రైతులను నిండా ముంచాడు. బాధితులు గ్రీవెన్స్‌లో ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో..




అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజావేదిక పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు విలవిల

ఒంగోలు టౌన్: కరెంటు చార్జీలు విపరీతంగా పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు చెప్పారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలను పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ప్రజల మీద పెను భారం మోపుతూ కరెంటు చార్జీలు విపరీతంగా పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో పెంచిన కరెంటు చార్జీలను వ్యతిరేకిస్తూ నగరంలోని మోటూరి ఉదయం కాలనీలో సోమవారం కరెంటు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం బృందం కేశవరాజు కుంట, చిన మల్లేశ్వరకాలని, బలరాం కాలనీ, ఉదయం కాలనీ, మిలిటరీ కాలనీ, పోనుగుపాటి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, కరుణ కాలనీ, భరత్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించిందని తెలిపారు. కేశవరాజు కుంటలో సైడ్ కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంతాన్ని మురుగు ఆక్రమించి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కేశవరాజు కుంట నుంచి పోతురాజు కాలనీ వరకు మెయిన్ డ్రయిన్ నిర్మించి కాలనీలోని కాలువలను దానికి అనుసంధానం చేయాలని కోరారు. చిమల్లేశ్వరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఇనుప రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారని, దాంతో పిల్లలు ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోటూరి ఉదయం కాలనీలో 60 కుటుంబాలు గత 20 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నారని, మౌలిక వసతులను కల్పించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ యాత్రలో జిల్లా కమిటీ సభ్యులు కంకణాల రమాదేవి, కల్పన, జి.రమేష్, తంబి శ్రీనివాసరావు, మహేష్, విజయమ్మ, వినోద్, ఆదిలక్ష్మి, గోపి, హుసేన్ పాల్గొన్నారు.

కోతలు కోస్తూ.. కన్నీళ్లు పెట్టిస్తూ..!

అర్ధరాత్రి కరెంటు.. అన్నీ కష్టాలే..



కురిచేడు మండలం కాటంవారిపల్లె గ్రామానికి చెందిన నుసుం నాగిరెడ్డి 5 ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. ఎకరానికి సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. 9 గంటలు కరెంటు ఇస్తామని చెప్పి 7 గంటలు ఇస్తున్నారు. మిగతా 2 గంటలు రాత్రి 10–12 వరకు ఇస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఆపిన కరెంటు రాత్రి 10 గంటలకు ఇచ్చేసరికి ఎండకు ఉదయం పెట్టిన నీరు ఇంకిపోతున్నాయి. సరిపడా నీళ్లు అందక పోవడంతో పంటలు ఎండిపోతున్నట్టుగా తయారవుతున్నాయి. పైగా తెల్లవారు జామున 4 గంటలకు కరెంటు ఇస్తుండడంతో మూడు గంటలకు లేచి పొలం వెళ్లాల్సి వస్తోంది. అర్ధరాత్రి పొలంలో విషసర్పాలు తిరుగుతుంటాయి. ఏ టైంలో ఏం జరుగుతుందోననే భయంగా..భయంగా పొలానికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రి పూట అనేసరికి కూలీలకు రెట్టింపు రేట్లు చెల్లించాల్సి వస్తోంది. 11 గంటలకు కరెంటు ఆగిపోతే పగలంతా పనులు చేసుకుని, మళ్లీ రాత్రిపూట రోజూ నిద్రకాయటం వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని నాగిరెడ్డి వాపోతున్నాడు. ప్రభుత్వ చర్యలతో అన్ని విధాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



కళ్ల ఎదుటే రెక్కల కష్టం చెదిరిపోతుంటే .. కరెంటు రూపంలో పంటలు ఎండుతుంటే..అన్నదాత గుండె మండుతోంది. తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాపై మాట తప్పిన కూటమి సర్కార్‌పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కోతలు విధిస్తూ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోంది. అది కూడా వేళాపాళా లేకుండా ఇష్టారాజ్యంగా కరెంటు ఇస్తుండడంతో రైతుల బాధలు వర్ణనాతీతం. ఒకవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు.. మరో వైపు విద్యుత్ కోతలు వారిపాలిట శాపంగా మారాయి.

- విద్యుత్ కోతలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- వ్యవసాయానికి అనధికారికంగా రెండు గంటలు కోత
- బోర్ల ద్వారా పంటలకు నీరు అందక మాడిపోతున్న వైనం
- ప్రస్తుతం రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇవ్వడంతో అవస్థలు
- రాత్రి వేళల్లో పొలాల్లో కాపలా కాస్తున్న రైతన్నలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరంతరాయంగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా వ్యాప్తంగా 2,36,866 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ సీపీడీసీఎల్) ఎలాంటి ప్రకటనలు చేయకుండానే అనధికారిక కోతలకు శ్రీకారం చుట్టాయి. జిల్లాలో 680 వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు ఉన్నాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాను ఏ, బీ గ్రేడులుగా విభజించించారు. ఏ గ్రేడులో ఉదయం గం.8.45 నుంచి సాయంత్రం గం.5.45 వరకు నిరంతరాయంగా ఇస్తున్నామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. బీ గ్రేడ్‌లో ఉదయం గం.9 నుంచి సాయంత్రం గం.6 వరకు సరఫరా చేస్తున్నామని అంటున్నారు.

వాస్తవానికి విరుద్ధంగా....

జిల్లాలో ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలో అన్ని రకాల పంటలకు బోర్లే ఆధారం. అందుకు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటేనే పంటలు పండుతాయి. పగటిపూట వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. మరో వైపు భూగర్భ జలాలు అడుగంటి పోతుండడం అన్నదాతను ఆందోళనకు గురిచేస్తోంది. ఉన్న నీటినైనా ఉపయోగించుకొని సాగు చేసిన పంటలను పండించుకుందామంటే విద్యుత్ అంతరాయం పెద్ద సమస్యగా మారింది. పగటి పూట నిరంతరాయం అని చెప్పి విడతల వారీగా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు అన్న తేడాలేకుండా సరఫరా ఇవ్వటంతో రాత్రి వేళల్లో కూడా రైతులు పొలాల్లో పంటలు తడుపుకోవటానికి పడిగాపులు కాయాల్సి వస్తోంది. పశ్చిమ ప్రకాశంలోని మండలాలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. రోజులో రెండు మూడు దఫాలుగా కరెంటు ఇస్తుండడంతో పంటలు సక్రమంగా తడవక రైతులు విలవిల్లాడుతున్నారు.

మెట్టకు బోర్లే ఆధారం..

పశ్చిమ ప్రకాశంలోని మండలాల్లో ఎక్కువ శాతం రైతులు ప్రధానంగా మిర్చి, శనగ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, కందులు, మినుము, పెసర, నువ్వు, ఆవాలు, మామిడి, నిమ్మ, సపోట, బత్తాయి, సన్‌ఫ్లవర్, వేరుశనగ, పొగాకు, పత్తితో పాటు అనేక రకాల పంటలు సాగుచేస్తున్నారు. అన్ని రకాల పంటలకు వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా అందించే బోరు నీరే ఆధారం. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే కీలక దశలో నీటి ఎద్దడి ఏర్పడి ఆయా పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేస్తున్నామని అధికారులు చెబుతుండగా .. 7 గంటలు కూడా సక్రమంగా ఇవ్వటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అదేమని అడిగితే లోడ్ రిలీఫ్ (ఎల్ ఆర్) ఇచ్చామంటూ విద్యుత్ అధికారులు, సిబ్బంది చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో మెయిన్ సప్లై పోయిందని, ఎప్పుడొస్తుందో చెప్పలేమనే సమాధానం ఇస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇలా ప్రతి రోజూ రెండు గంటలకు పైగా అనధికారికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మార్చి నెల దాటితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. కనీసం 5 గంటల సరఫరా కూడా సక్రమంగా అందుతుందో లేదోననే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

గతం.. ఘనం

వ్యవసాయానికి పగటి పూటే నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టింది. అభివృద్ధి పనులకు నాంది పలికింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టింది. అప్పటికి ఉన్న ఫీడర్ల సామర్థ్యం సరిపోదని భావించి, ట్రాన్స్‌మిషన్ కెపాసిటీ అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా రూ.850 కోట్ల వ్యయంతో 35 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి నాంది పలికింది. సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ ఫీడర్లను సిద్ధం చేసింది. నూతనంగా 1750 కిలో మీటర్ల మేర విద్యుత్ లైన్లు వేసింది. నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా వ్యవసాయానికి అందజేసింది. విద్యుత్ ఉపకేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి నిర్మాణాలు పూర్తయి, సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కొన్నింటిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వినియోగంలోకి తెచ్చింది.

వేళాపాళాలేని కోతలతో ఇబ్బంది పడుతున్నాం..



నేను 27 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశాను. పొగాకు 7 ఎకరాలు, నిమ్మ 4 ఎకరాలు, బొబ్బర్లు 6 ఎకరాలు, మినుము 4 ఎకరాలు, కంది 6 ఎకరాల్లో సాగు చేశాను. వ్యవసాయానికి ఉదయం 8:00 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పగటిపూట తొమ్మిది గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలి. అప్పుడే రైతులు తమ పొలాల్లో నీరు పెట్టుకుంటారు. ఇటీవల కాలంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రిపూట సరఫరా చేయటం వల్ల నీరు పెట్టుకోవటం ఇబ్బందిగా ఉంది. కరెంట్ కోతలతో సరఫరా ఇలా కొనసాగితే పొగాకు, నిమ్మ పంటలు దెబ్బతింటాయి.

– రామాంజనేయ రెడ్డి, రైతు, పొదిలి మండలం బట్టువారిపల్లి

రాత్రి పూట జాగారం..



గత ఏడాది మిర్చి 5 ఎకరాలు సాగు చేశాను. మాది వర్షాధారం. బోర్ ద్వారా పైరుకు నీటి తడి ఇస్తాను. అయితే పగటి పూట విద్యుత్ ఒక్కొక్కసారి నిరంతరం 9 గంటలు ఇవ్వడం లేదు. ఇలా ఇవ్వని రోజు రాత్రి పూట ఇస్తారు. దీంతో రాత్రి పూట పొలాలకు వెళ్లి నీటి తడులు పెట్టుకుంటూ జాగారం చేస్తాను. మేము కోరేది ఒకటే..రోజూ ఎటువంటి అంతరాయం లేకుండా పగటి పూట 9 గంటల విద్యుత్ ఇవ్వాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు, రైతు, కొనకనమిట్ల మండలం గొట్లగట్టు

యువత పోరు ర్యాలీ విజయవంతం చేయండి

- ఒంగోలులో 'యువత పోరు' ర్యాలీ రేపు
- అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం
- ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగ భృతిపై మోసగించిన చంద్రబాబు
- వెలుగొండపై బాబు చెప్పేవన్నీ అసత్యాలే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, చుండూరి రవిబాబు తదితరులు

ఒంగోలు సిటీ: విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, యువతకు ఉద్యోగ కల్పన లేకుండా మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 12న చేపట్టిన ‘యువత పోరు’ ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువత పోరు పోస్టర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ నెల్లూరు బస్టాండ్ దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. యువత, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏ ఇబ్బందులు లేకుండా 99 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఇచ్చారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కింద గత ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత సంవత్సరానికి కలిపి రూ.7800 కోట్లు బకాయిలు ఉంటే కేవలం రూ.700 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కూడా సుమారు రూ.2 వేల కోట్లు మాత్రమే పెట్టారన్నారు. ఫీజులు కట్టడం లేదని కొంత మంది యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు డ్రాప్‌అవుట్‌గా మిగిలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడమే కాక, ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగభృతి ఒక్కొక్కరికీ రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు కానీ ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశచరిత్రలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని, అందులో 5 మెడికల్ కాలేజీలు పూర్తి చేశారని చెప్పారు. 12 మెడికల్ కాలేజీలు నిర్మాణ దశలో ఉండగా, చంద్రబాబు ఈ రాష్ట్రానికి మెడికల్ సీట్లు అవసరం లేదని సెంట్రల్ గవర్నమెంట్ కు లిఖిత పూర్వకంగా ఇచ్చారన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ 75 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన నిధులు విడుదల చేసి పూర్తిచేయాలని, మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో రూ.లక్ష కోట్లు అప్పు చేశారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంట్రల్ గవర్నమెంట్ నుంచి డబ్బులను ఎన్నికల ముందు సంక్షేమ పథకాల అమలు కోసం కేటాయిస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్ష కోట్లు అప్పులు చేసి కూడా ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదన్నారు.

వెలుగొండపై చంద్రబాబు చెప్పేవన్నీ అసత్యాలే..

వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు చేసిన ప్రసంగాలన్నీ అసత్యాలేనని బూచేపల్లి ధ్వజమెత్తారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలోని రెండు టన్నెల్స్ పూర్తి చేశారన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చి ఉంటే ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి వెలిగొండ ద్వారా నీళ్లిచ్చే వాళ్లమన్నారు. కానీ మార్కాపురం సభలో చంద్రబాబు చేసిన ప్రసంగం అంతా అబద్ధాల పుట్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్లో రూ.600 కోట్లు అని పెట్టారు కానీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, వెలుగొండను నిర్వీర్యం చేశారన్నారు. చంద్రబాబు కేవలం ప్రాజెక్టుకు శంకుస్థాపన మాత్రమే చేశారని, ఆ తర్వాత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పనులు ప్రారంభించి శరవేగంగా చేశారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో వెలుగొండకు నిధులు కేటాయించి రెండు టన్నెల్స్ పూర్తి చేశారని అన్నారు. చంద్రబాబు తొమ్మిది నెలల కాలంలో ఒక్క సెంటీమీటరు అన్నా పనులు చేశారా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాడేందుకే తాము ప్రతిపక్ష హోదా అడుగుతున్నామని, కానీ కూటమి ప్రభుత్వం జగన్‌కి ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ప్రభుత్వ వైఫల్యాలపై ఎక్కడ ప్రశ్నిస్తాడేమోనని భయంతో ఉన్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ పనీ చేయొద్దని చంద్రబాబు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కర్నేటి ప్రసాద్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు క్యాలెండరు ఆవిష్కరణ

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబులు కోర్టు క్యాలెండరును సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు ధర్నాసి హరిబాబు, ఒంగోలు నియోజకవర్గ సమాచారహక్కు వింగ్ అధ్యక్షుడు కె.శేషాద్రిరెడ్డి, ఇతర లీగల్ సెల్ సభ్యులు కాటుకూరి బాబురావు, కాటుకూరి సంపత్, ఎస్.పి.జయచంద్రనాయక్, గాయం సావిత్రి, నీలం పద్మలత, తోట రాగసుధారాణి, నాగమల్లేశ్వరరెడ్డి, గంగవరపు ప్రవీణ్‌కుమార్, కె.స్వామిరెడ్డి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, చుండూరి రవిబాబు

పొగాకు వేలం ప్రారంభం



ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రంలో వేలం తీరును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు, పక్కన ఆర్‌ఎం లక్ష్మణ రావు తదితరులు



పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబును సత్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 4 వేలం కేంద్రాల్లో మొదలు
- మిగతా ఏడు కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి ప్రారంభం
- కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్పం రూ.278

ఒంగోలు సబర్బన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సోమవారం నుంచి పొగాకు వేలం ప్రారంభమైంది. ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్టలో ఉన్న ఒంగోలు-1 వేలం కేంద్రంతో పాటు కొండపి, పొదిలి వేలం కేంద్రాల్లో ప్రారంభించారు. నెల్లూరు జిల్లా కందుకూరు వేలం కేంద్రంలో కూడా ప్రారంభమైంది. మిగతా ప్రకాశం జిల్లాలోని 5 వేలం కేంద్రాలు, నెల్లూరు జిల్లాలోని 2 వేలం కేంద్రాల్లో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. అయితే మొదటి రోజు నాలుగు వేలం కేంద్రాల్లో కలిపి 81 బేళ్ల వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలంలో 15 పొగాకు కంపెనీలు పాల్గొన్నాయి. అన్ని వేలం కేంద్రాల్లో అత్యధికంగా కిలో పొగాకు ధర రూ.280, అత్యల్ప ధర రూ.278 పలికింది.

పొగాకు వేలం కేంద్రాన్ని ప్రారంభించిన బోర్డు ఈడీ శ్రీధర్ బాబు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో ఉన్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ప్రారంభించారు. తొలిరోజు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికింది. మొదట వేలం కేంద్రంలో జరిగిన ప్రారంభ పూజల్లో ఆయన పాల్గొని చిలంకూరుకు చెందిన 18 పొగాకు బేళ్లను మొదటి రోజు వేలానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పొగాకుకు డిమాండ్‌ను బట్టి ధరలు వస్తాయన్నారు. కరోనా కాలంలో అంతర్జాతీయంగా పలు దేశాల్లో పొగాకు ఉత్పత్తి లేక గత ఏడాది మంచి ధరలు లభించాయన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయంగా పలు దేశాల్లో పొగాకు ఉత్పత్తి చేశారన్నారు. ఈ ఏడాది పొగాకుకు ఖర్చులు పెరిగిపోయాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకు బయ్యర్స్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ ఏడాది కూడా పొగాకుకు తగు మేరకు ధరలు లభిస్తాయని పేర్కొన్నారు. పొగాకు వేలాన్ని ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం.రవికాంత్ పర్యవేక్షించారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రైతు సంక్షేమ భవన్, పొగాకు బోర్డు కార్యాలయాలకు ఈడీ శంకుస్థాపన చేశారు. రైతు కమిటీ ఆధ్వర్యంలో ఈడీ అద్దంకి శ్రీధర్ బాబును రైతు కమిటీ నాయకులు ఆళ్ల సుబ్బారావు, ఫ్లోర్ కమిటీ అధ్యక్షుడు సూరం గురువారెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు, పొగాకు బోర్డు డైరెక్టర్ పాద వరప్రసాదరావు, మాజీ డైరెక్టర్ పి.బద్రిరెడ్డి, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివ కుమార్, జీపీఐ ప్రతినిధులు ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు 1, 2 వేలం కేంద్రాల రైతు కమిటీ అధ్యక్షులు ఎస్ గురువారెడ్డి, వి ప్రసాద్, రైతు కమిటీ నాయకులు ఆళ్ల సుబ్బారావు, వడ్డం పూడి వెంకటేశ్వరరావు, జి సుబ్రమణ్యం, లింగంగుంట వెంకటేశ్వర్లు, మేకల కృష్ణారెడ్డి, ఎం వెంకటనారాయణ, కరిచేటి సుబ్బారావు, ఎస్ మస్తాన్ రెడ్డి, ఆళ్ల రవి, వరహాల చౌదరి, బోర్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మరోసారి వంచనకు గురిచేయొద్దు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య

ఒంగోలు టౌన్: జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేయనున్నట్లు చెప్పడమంటే మరోసారి మాదిగలను వంచనకు గురి చేయడమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా దామాషా ప్రకారం వర్గీకరణకు కట్టుబడిన చంద్రబాబు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో నేడు జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేస్తామని చెప్పడం అన్యాయం అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరి మెప్పు కోసం నేడు జిల్లా యూనిట్ గురించి మాట్లాడుతున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణ కోసం గతంలో వేసిన కమిషన్లన్నీ జనాభా దామాషా ప్రకారమే చేయాలని నివేదికలు ఇచ్చాయని గుర్తు చేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల జనాభా 84,45,400 మంది ఉన్నారని, వారిలో మాలలు 40,43,101 మంది ఉండగా, మాదిగలు 34,68,967 మంది ఉన్నారని, ఉప కులాలు 9,33,332 మంది ఉన్నారని వివరించారు. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం మాలలకు 7 శాతం, మాదిగలకు 6 శాతం, ఉప కులాలకు 2 శాతం వర్తిస్తుందన్నారు. విభజిత ఏపీలో మాదిగల కంటే మాలలు ఎక్కువగా ఉన్నందున వారికి దక్కాల్సిన వాటా దక్కడం ధర్మమేనని చెప్పారు. అలాగే మాదిగలకు కూడా న్యాయబద్ధంగా వాటా అందించాలని డిమాండ్ చేశారు. అందుకు భిన్నంగా జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అమలు చేస్తే మాల మాదిగలతో పాటుగా సంచార జాతులకు కూడా అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ఆలూరి చిరంజీవి, రేణమాల మాధవ, గొడిపేరు కృష్ణ, జి.మహేష్, ముట్లూరి మోజేష్, ఏ.ప్రకాశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్య

విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించారు

- కూటమి ప్రభుత్వంపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం


యువత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ఈ నెల 12వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరు వాల్ పోస్టర్లను సోమవారం యర్రగొండపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉందని, ఇటువంటి వ్యక్తి రాష్ట్ర ప్రజలను ఈ విధంగా మోసం చేయవచ్చా..? అని ప్రశ్నించారు. చిట్టచివరి అవకాశం అని చెప్పుకున్న ఆయన.. తన చిట్టచివరి అవకాశంలో కూడా మోసాన్నే ఆయుధంగా మార్చుకుని కొనసాగాలనుకుంటున్నారని, ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తుండగా, రూ.3.20 లక్షల కోట్లతో ప్రకటించిన బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు నామమాత్రపు కేటాయింపులు చేసింది వాస్తవమన్నారు. ఈ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి, ప్రజల్లోని వ్యతిరేకతను ప్రభుత్వానికి చూపించటానికి వైఎస్సార్ సీపీ యువత పోరు చేపట్టిందని తెలిపారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను నిర్వహించలేమంటూ ప్రైవేటు వ్యవస్థకు అప్పజెప్పాలని మాట్లాడటం సిగ్గుచేటు కాదా అని నిలదీశారు. చంద్రబాబు అసమర్థ పాలనకు ఇదో ఉదాహరణ కాదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆ వైద్య కళాశాలలపై, ఆ సీట్లపై, వాటి ఫీజులపై పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారం చేసిన లోకేష్.. ప్రస్తుతం విద్యాశాఖమంత్రిగా ఉన్నారని, విద్యార్థులను ఇలా మోసం చేయడం ధర్మమేనా అని నిలదీశారు. విద్యార్థులకు మూడు త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెంట్ల కింద రూ.4,600 కోట్లు బకాయిలు పెట్టి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. మార్కాపురంలో చంద్రబాబు సభ జరిగిన ప్రాంతానికి పక్కనే మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉందని, అది వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజల కల అని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో మెడికల్ కాలేజీ తీసుకొచ్చారని, కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే కాంట్రాక్టర్ పారిపోయేలా చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలకు ఇదే గతి పట్టించారని, వాటిని నిర్వీర్యం చేస్తూ ఎక్కడికక్కడ పనులు ఆపివేశారని ఆయన విమర్శించారు. వైద్యశాఖామంత్రి నిస్సిగ్గుగా మెడికల్ కాలేజీలను తాము నిర్వహించలేం అంటున్నారని, చేతకానప్పుడు రాజీనామా చేయండని, మళ్లీ ఎన్నికలకు వెళ్దామని, లేకుంటే రాష్ట్రపతికి అప్పజెప్పమని, రాష్ట్రపతి పరిపాలన పెట్టి వ్యవస్థలన్నీ కొనసాగిస్తారని ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్సుపై జిల్లాలకు మాత్రమే పరిమితమని ఒక మంత్రి మాట్లాడతారని, చెప్పిన హామీలను తుంగలో తొక్కి మాటమార్చడం, ఇంతదగా చేయడం న్యాయమా, ధర్మమా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బడ్జెట్లో దామాషా ప్రకారం పశ్చిమ ప్రకాశానికి ఇవ్వాల్సిన వాటా కూడా ఇవ్వకుండా కేవలం రూ.309 కోట్లను వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించారన్నారు. టీడీపీ నాయకులు సిగ్గుపడాలని, బాధ్యతగా వ్యవహరించాలని, పశ్చిమ ప్రాంత ప్రజలపై మీ రాజకీయాలు రుద్దవద్దని ఎమ్మెల్యే చంద్రశేఖర్ అన్నారు. ఈ ప్రాంతానికి వెలిగొండ తప్ప మేలు జరిగే వ్యవహారంగానీ, ప్రాజెక్టుగానీ లేదన్నారు. భూమి ఉన్నంత కాలం పశ్చిమ ప్రకాశానికి నీటి ఎద్దడి ఉంటుందని ఐక్యరాజ్యసమితి మాట్లాడిన చరిత్ర ఉందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై నీజమైన రాజకీయాలు చేస్తే పేదవాళ్ల గొంతు ఎండి మరణించడం తప్ప మరోమార్గం లేదన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒ.మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ సి.విజయభాస్కర్, పార్టీ జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, ఎస్.ప్రసాద్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జి.రమణారెడ్డి, బాలగురవయ్య, జబీవుల్లా, పి.సరళ, ఆర్.అరుణాబాయి పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్‌పై లైన్‌మన్ దౌర్జన్యం

- సహాయకుడికి మద్దతుగా వచ్చి దాడి చేసిన వైనం
- తనకు రక్షణ కల్పించాలంటున్న షిఫ్ట్ ఆపరేటర్ చంద్రశేఖర్


మాట్లాడుతున్న బాధితుడు గుర్రాల చంద్రశేఖర్

కొమరోలు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌పై లైన్‌మన్ తన అసిస్టెంట్‌తో కలిసి దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం కొమరోలు మండలం తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. షిఫ్ట్ ఆపరేటర్ గుర్రాల చంద్రశేఖర్ కథనం మేరకు.. తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గత రెండేళ్ల నుంచి చంద్రశేఖర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 6వ తేదీ గురువారం రాత్రి లైన్‌మెన్ డికోజీ నాయక్ అసిస్టెంట్‌గా ఉన్న నాగూర్ అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పడుకునేందుకు వెళ్లాడు. దీంతో ×మద్యం తాగి ఉన్నావు.. ఇక్కడ పడుకోవద్దు¥ అని షిఫ్ట్ ఆపరేటర్ నిరాకరించాడు. ఆ సమయంలో ఆపరేటర్‌ను తిడుతూ నాగూర్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం చంద్రశేఖర్ విధుల్లో ఉన్న సమయంలో లైన్‌మన్ డికోజీ నాయక్, అసిస్టెంట్ నాగూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. చంద్రశేఖర్‌పై దౌర్జన్యం చేసి దుర్భాషలాడటమే కాకుండా చేతులతో నెట్టి కొట్టారు. సబ్ స్టేషన్‌లో జరిగిన పరిణామాలపై విద్యుత్ శాఖ ఏఈకి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశాడు. దీంతో విద్యుత్ లైన్‌మన్ డికోజీనాయక్, అసిస్టెంట్ నాగూర్ మళ్లీ సబ్ స్టేషన్ వద్దకు చేరుకుని 'మాపైనే ఫిర్యాదు చేస్తావా, నీ సంగతి తేలుస్తాం, అంతు చూస్తాం' అని బెదిరించారు. తనకు ప్రాణహాని ఉందని, రాత్రి వేళల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఒక్కడినే ఉంటానని, తనకు రక్షణ కల్పించాలంటూ సంబంధిత అధికారులను షిఫ్ట్ ఆపరేటర్ చంద్రశేఖర్ వేడుకుంటున్నాడు.

సబ్‌రిజిస్ట్రార్‌పై ఆగంతకుల దాడి


ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.కృష్ణమోహన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి గిద్దలూరు పట్టణంలోని జువ్విళ్లబావి సమీపంలో సబ్ రిజిస్ట్రార్ ఇంటి వద్ద చోటుచేసుకుంది. ఇటీవల బదిలీపై గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన కృష్ణమోహన్ తన సమీప బంధువుతో కలిసి జువ్విళ్ల బావి వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కుటుంబ సభ్యులు మాత్రం చీరాలలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి ముఖానికి మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్‌పై దాడికి తెగబడినట్లు సమాచారం. పిడిగుద్దులు కురిపించిన వెంటనే అక్కడ నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. దాడి అనంతరం తేరుకున్న సబ్‌రిజిస్ట్రార్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి పొద్దుపోయే వరకు భూముల రిజిస్ట్రేషన్లు సాగుతున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన వెంకటేశ్వర్లు

కంభం: వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకిరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి అనంతపురం-అమరావతి హైవే రోడ్డుపై కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. యర్రగొండపాలేనికి చెందిన నలుగురు వ్యక్తులు రెండు బైకులపై వ్యక్తిగత పని నిమిత్తం నంద్యాల జిల్లా పాణ్యం వెళ్తున్నారు. ఈ క్రమంలో కంభం పట్టణంలోని హైవే రోడ్డుపై ఉన్న యూటర్న్ అర్థంగాక ఓ బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి రోడ్డు మీద పడిపోయిన బి.వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైకును ఢీకొట్టిన లారీ

- చర్చి పాస్టర్ మృతి

అద్దంకి: బైకును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ చర్చి పాస్టర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన అద్దంకి పట్టణంలోని బస్టాండు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన పాస్టర్ అత్తోటి బాలసుందరం(66) బైకుపై వ్యక్తిగత పని నిమిత్తం అద్దంకి వచ్చారు. బైకు బస్టాండ్ సమీపంలోకి రాగానే.. అద్దంకి నుంచి మేదరమెట్ల వైపుకు వెళ్తున్న లోడ్ లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలసుందరం అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని ఎస్సై రవితేజ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాబు పాలనలో అడుగడుగునా వంచనే..

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున


యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జునతో పార్టీ నాయకులు

మద్దిపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో మోసం, వంచనలే ఉంటాయని మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. యువతకు లక్షలాది ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఉద్యోగం లేని యువకులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసపూరితమైన వాగ్దానాలు చేశారని, పదవి వచ్చిన తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి వసతి దీవెనకు సంబంధించి రూ.4600 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే అందులో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభమైన దశలో మొత్తం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను రద్దు చేయొద్దని, పేద విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించడానికి కళాశాలలను ప్రభుత్వమే నడిపించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలను పూర్తిగా ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు రైతులు మద్దతు ధర లేక విలవిలాడిపోతున్నారన్నారు. మిర్చి పంట వేసిన రైతులకు గతంలో క్వింటా రూ.28 వేల వరకు ధర వస్తే ప్రస్తుతం చంద్రబాబు ధర విషయంలో కేంద్రం రూ.11 వేలు ఇస్తుంది అని చెప్పి తప్పుకున్నారన్నారు. పత్తి, వరి రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. రైతులు, విద్యార్థులు, యువకులు ఏ ఒక్కరూ సంతోషంగా లేరని అన్నారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 12న ×యువత పోరు' కార్యక్రమం చేపట్టామని, యువతకు సంబంధించిన పలు విషయాలపై కలెక్టర్‌కు మెమొరాండం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ తరలిరావాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లేలా కార్యక్రమం నిర్వహించుకోవాలని కోరారు. ముందుగా ఆయన 'యువత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, మద్దిపాడు మండల పార్టీ కార్యదర్శి వాక కోటిరెడ్డి, పైనం ప్రభాకర్, పైడిపాటి వెంకట్రావు, నాదెండ్ల నాదెండ్ల మహేష్, రామాంజనేయులు, పల్లపాటి అన్వేష్ ,దుద్దు వినోద్, సురేష్, సుబ్బారావు, అనిల్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సబ్సిడీ పనిముట్ల పేరుతో రైతులకు మోసం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీసులకు బాధితుల ఫిర్యాదు


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

ఒంగోలు టౌన్: సబ్సిడీ పనిముట్లు ఇప్పిస్తానంటూ దర్శికి చెందిన ఒక మోసగాడు రైతులను నిండా ముంచాడు. దర్శి ప్రాంతానికి చెందిన పలువురు రైతులకు మాయమాటలు చెప్పి 16.82 లక్షల రూపాయలు వసూలు చేశాడు. రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనిముట్లు ఇప్పించకపోవడంతో రైతులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లి నిలదీశారు. అయినప్పటికీ అతడు లెక్క చేయకుండా నిర్లక్ష్యంగా జవాబు ఇవ్వడంతో మోసపోయినట్లు గమనించిన రైతులు సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్న పోలీసు అధికారులు చట్టపరంగా విచారించి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మరో ఘటనకు సంబంధించి.. ఒంగోలుకు చెందిన ఒక యువకుడికి కరెంటు ఆఫీసులో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నగరానికి చెందిన వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని బాధితులు ఫిర్యాదు చేశారు. కరెంటు ఆఫీసులో ఉద్యోగం పేరుతో 6 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగం రాకపోవడంతో తమ వద్ద తీసుకున్న డబ్బు తిరిగివ్వమని అడిగితే ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరిస్తున్నాడని బాధితులు వాపోయారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి 77 ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

కులం పేరుతో దూషిస్తూ అత్తింటివారి వేధింపులు

- ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఒంగోలు టౌన్: కులాంతర వివాహం చేసుకున్న ఒక దళిత మహిళను అత్తింటి వారు కులం పేరుతో దూషించడమే కాకుండా ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారన్న ఫిర్యాదుపై ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన ఎస్సీ మహిళ సురేఖ బ్రాహ్మణ కులానికి చెందిన చంద్రశేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. అనారోగ్యంతో చంద్రశేఖర్ 2023లో మరణించారు. అనంతరం ఆస్తి పంపకాల విషయమై అడిగితే అత్తింటివారు కులం పేరుతో దూషిస్తూ ఆస్తిలేదు.. పాస్తిలేదని తెగేసి చెబుతున్నారు. మూడు సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత నెల 26వ తేదీ సురేఖ చిన్న కూతురికి ఆరోగ్యం బాగలేకపోవడంతో చికిత్స చేయించేందుకు వైద్యశాల ఖర్చులు అడగటానికి అత్తవారింటికి వెళ్లగా, బయటకు నెట్టి వేసి కులం పేరుతో దూషించారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో గత ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాలు కాపాడిన పోలీసులు


యువకుడిని లాక్కెళ్తున్న రాచర్ల ఎస్సై

రాచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన సంగపేట-జగ్గంబొట్లకృష్ణాపురం మధ్య రైల్వే ట్రాక్‌పై సోమవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు వివరాలు.. కంభం పట్టణానికి చెందిన కొప్పుల రమేష్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్నాడు. ఈ విషయాన్ని తన సన్నిహితులకు తెలియజేశాడు. రమేష్ ఆత్మాహత్య చేసుకోబోతున్నాడని కంభం పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఫోన్ లొకేషన్ ట్రేస్ చేశారు. రాచర్ల పరిధిలో లొకేషన్ చూపించడంతో అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు సంగపేట-జగ్గంబొట్లకృష్ణాపురం రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని యువకుడిని రక్షించారు. కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలే ఆటో చోరీ

- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి పట్టివేత


చోరీకి గురైన ఆటో ఇదే..

రాచర్ల: జనం సంచారం మెండుగా ఉన్న సమయంలో ఆటో చోరీకి గురైంది. ఈ సంఘటన మండల కేంద్రమైన రాచర్ల కస్తూర్బా బాలికల పాఠశాల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. కంభం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ శివశేఖర్ కుమార్తె రాచర్ల కస్తూర్బా బాలికల పాఠశాలలో చదువుతోంది. సోమవారం కుమార్తెను చూసేందుకు వచ్చిన శివశేఖర్ తన ఆటోను స్కూల్ బయట ఉంచి లోపలికి వెళ్లాడు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను అపహరించారు. స్కూల్ నుంచి బయటికి వచ్చిన తర్వాత ఆటో కనపడకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాచర్ల, అనుములపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను ఎస్సై పి.కోటేశ్వరరావు పరిశీలించారు. ఆటోను చోరీ చేసిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఇతర అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానమిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 237 అర్జీలు రాగా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.